# స్వస్వరూప సంధానము

కె. సత్యనారాయణమూర్తి
రిటైర్డ్ టీచర్
9912459239

# పాట – 1

ఆది దేవా ఓ దివ్య పురుషా శ్రీనాన్న పరమాత్మా
జ్ఞాన స్వరూపా కరుణా సాగరా అనంత తేజుండా
ఆది దేవా ఓ దివ్య పురుషా శ్రీనాన్న పరమాత్మా

ఈ మాయా జగత్తుకే నువ్ ఎదురు తిరిగి నిలిచావా
మాయను ఛేదించుకొనీ బ్రహ్మమై వెలిగావా
నిన్ను స్మరియించినంతనే శాంతిని కురిపిస్తావా
శరణొందిన భక్తజనుల బ్రహ్మమయం చేస్తావా ॥ఆది॥

పల్లెయనక పట్నమనక కాలమెల్లా పర్యటించీ
పామరులను ప్రేమతోన వెన్నుతట్టి ప్రోత్సహించి
ఆశ్రమాలు స్థాపించి అమరవిద్య బోధించి
అజ్ఞాన తిమిరము బాపి ఆత్మ వెలుగులిచ్చావా ॥ఆది॥

జగత్తు జీవుడు దేవుడూ మనోకల్పితాలేననీ
బ్రహ్మమొక్కటే సత్యమని అదియే నీ స్వరూపమని
మరణించే లోపుగనే ఆ బ్రహ్మమును పొందుమనీ
జీవితకాల పర్యంతం శ్రీనాన్నబోధల పరమార్థం ॥ఆది॥

# పాట – 2

రమణ మార్గమూ శ్రీ రమణ మార్గమూ
శ్రీ నాన్న చాటి చెప్పిన సరళమైన సూటి మార్గమూ ॥రమణ॥

జపతపములు చేయకుండనే సాధనలతో నలిగిపోకనే
అసలడుగు కదపకుండగానే ఆత్మ పదవి నొందుమార్గమూ ॥రమణ॥

ఇల్లు విడిచి పోకుండానే నీ దేహములో నీవుండగనే
ఇప్పుడే అరె ఇక్కడే జీవన్ముక్తిని పొందే మార్గం ॥రమణ॥

చుట్టుదారులు కట్టిపెట్టీ లోచూపు కందేదీ మార్గం
నిను మాయ చేసే నేనును పట్టీ మట్టుపెట్టేదీ మార్గం ॥రమణ॥

నేనూ నేనని లేచే మనసునూ నేనెవ్వడాని వెంబడించీ
తన మూలమైన బ్రహ్మము చేరి పరబ్రహ్మమై వెలిగే మార్గం ॥రమణ॥

## పాట - 3

మాయా జీవితాలు ఇవి మాయా జీవితాలు
సత్యముగా భాసించెడి మిధ్యామయ మెరుపుతీగలు
శాశ్వతమని భ్రమగొలిపే మూణ్ణాళ్ళ ముచ్చటలు
మాయా జీవితాలు ఇవి మాయా జీవితాలు

లోకమే లోకమంటూ లోకమెంట పరుగిడబోకు
లోకంలో శోకం కన్నా ఏమున్నది చూసేందుకు?
ఈ జీవితమంతా బూటకమే కాదా!
స్వప్నం కన్నా జీవితం ఏమిటి మిన్నా? ॥మాయా॥

అహమే మనలో అనర్థాలకు మూలం

ఈ సృష్టిలో లేదు అహము కన్నా నీచం
అహంకారము ఉంటే ఇక అంతా ఉంది
అహము నొదిలితే ఆత్మే మిగిలేది ॥మాయా॥

నీవు ఆత్మవె గానీ దేహానివి కానే కావు
దేహబుద్ధిని విడిచి ఆత్మ దృష్టితో చూడు
అహము నుండి విడుదల కోసం అవనిలోకి నీవొచ్చావు
లక్ష్యాన్నే మరిచిపోయి ప్రకృతిలో పరుగిడబోకు ॥మాయా॥

నీ బాధ్యతనంతా భగవంతునికివ్వు
శ్వాస విడిచినా విశ్వాసం విడువకు
భౌతిక ప్రక్రియల వల్ల ఆత్మను నీవందలేవు
పరిశుద్ధ హృదయమొక్కటే నిను నిన్నుగ పరము జేర్చు ॥మాయా॥

## పాట - 4

ఓ మాయాధీశుడా అరుణాచలేశుడా
ఏమిటయ్యా ఏమిటయ్యా ఈ మాయ
అసలెలా తొలగుతుందయ్యా ఈ ఛాయ ॥ఓ॥

ఉన్నదీ లేనిదీ ఆరెంటి నడుమనున్నది
అంతా నీవే కావా! నువు లేనటులే ఉంటావా ॥ఓ॥

ఈ సృష్టి స్థితిలయలకు ఆధారము నీవేగా
సకల ప్రాణులలో నర్తించేటీ ఆ పరబ్రహ్మం నీవేగాదా ॥ఓ॥

అవివేకం అజ్ఞానం గాఢాంధకారములో
ఎన్నాళ్ళని త్రిప్పేవూ? మమ్మెందుకు ఆడిస్తావు ॥ఓ॥

జన్మకొచ్చినది ఎందుకో! మేము బ్రతికేది ఎందుకో
పరమార్థమెరుగనీ ఈ గారడి బ్రతుకెందుకో ॥ఓ॥

విశ్వమంతా నిలిచి వెలుగు అరుణాచల పరశివుడా
శరణు శరణు శరణమయా నీ చరణాలిక విడువమయా ॥ఓ॥

## పాట - 5

అరుణాచలా అరుణాచలా అగ్నిలింగా ఆది దేవా
అరుణాచలా అరుణాచలా అగ్నిలింగా ఆది దేవా ॥అరుణా॥

అరుణాచలమునే ఇరుసుగా చేసి అందాల భువిని సృష్టించినావు
అరుణాచలమని స్మరియించినంతనే ముక్తుల కమ్మని శాసించినావు ॥అరుణా॥

చతురావతారములే శాస్త్రాలు చాటినా సకల జీవులలో చరియించు పరమాత్మ నీవు
ఒక్క ప్రదక్షిణతోనే జన్మల వెంటాడి మోక్షఫలమొసగే గిరిరూపధారి ॥అరుణా॥

నీ విశ్వప్రేమ మాపై కురియగా నీతనయునే రమణునిగా తరలించినావు
ఈ భక్త జనుల తరియింపనెంచి ఆత్మపథమును చూపే వెలుగు నిచ్చావు
॥అరుణా॥

## పాట - 6

ఏమి చిత్రం ఏమి గారడి ఏమిటీ మాయా

నడుపుతున్నావా ఓ సద్గురు దేవా ఓ నాన్నా ఓనాన్నా ॥ఏమి॥

ఉన్నదేమో అగుపడదు మరిలేనిదేమో మరుగవదు
ఉన్నది లేనిదిగానూ లేనిది ఉన్నదిగానూ
మాయ తెరల కమ్మించి మర్మం చేస్తావా మర్మం చేస్తావా ॥ఏమి॥

ఆదియంత రహితుడవు సర్వశక్తిమంతుడవు
విశ్వములో అణువణువున ఆత్మగ అమరివున్నావు
మరి ఆత్మ తప్పా అన్యమంతా చూపుతావేమి మహనీయా ॥ఏమి॥

ఆటబొమ్మల మేమనీ నాటకమీలోకమనీ
సృష్టిమూలం నీవనీ ఆడిస్తున్నావనీ
తెలిసికూడా ఏమిటయ్యా ఏమిటి ఈ మరుపు
మూఢులం అజ్ఞానులం మాపైన కరుణజూపు ॥ఏమి॥

సుఖమూ దుఃఖము నీవే ఇహమూ పరమూ నీవే
ఈ మహిలోని సర్వము సకలము సత్యము నీవే
నీ సృష్టీ స్థితిలయలలో పుట్టిన అత్యల్ప ప్రాణులము
మాపైన నీ మాయ ఉపసంహరించు గురువరా ॥ఏమి॥

ఈ కాల చక్రంలోనా కటకట పడుతున్నామే
కలికాల ఖర్మలలో కొట్టుకుపోతున్నామే
ఓ పవిత్రుడా త్రినేత్రుడా పావన జీవన గతుడా
కరుణించి మాయ పొరల కరిగించుము దేవరా ॥ఏమి॥

# పాట - 7

విప్లవం విప్లవం ఇదో ఆధ్యాత్మిక అద్వితీయ విప్లవం
విప్లవం విప్లవం ఇదో ఆధ్యాత్మిక అద్వితీయ విప్లవం

కదలిరండి ముందుకు భక్తులంతా ఏకమై
విడువరండి అహమును కదం తొక్కి ధీరులై
సత్యజ్ఞాన స్వరూపుడు శ్రీనాన్నగారు ఉండగా
మృత్యువునే మృతిచేసిన రమణస్వామి అండగా ॥విప్లవం॥

అజ్ఞానపు ఈ తెరలను చించివేయ నెంచగా
శాంతి యొకటే సృష్టిలోన విస్తరింపజేయగా
భక్తి అనే కత్తిపట్టి పోరు సలుపు నిత్యమూ
వైరాగ్యమనే గొడ్డలితో నరుకుమూ సమస్తమూ ॥విప్లవం॥

ఈ సంగ్రామానంతరం శోకమన్నదుండదూ
ఆ సర్వేశ్వరుడొచ్చినా చూడబుద్ధివేయదూ
అమరశాంతి సిద్ధించును ఈదాడిలో మరణించగా
మోక్షమే వరించును ఈ రణములో జయించగా ॥విప్లవం॥

మనకు ఉన్న శత్రువులు అజ్ఞానమహంకారములే
మనల మట్టుపెట్టజూచేదీ ఇంద్రియ చాపల్యమే
అందుకే ఎరుక అనే ఆయుధముతో నిత్యము నిను కాచుకో
వివేకము విచారణలతో నీ మనసును చంపేసుకో ॥విప్లవం॥

# పాట – 8

అమ్మవా అరుణాచలానివా నువు అమ్మవా అరుణాచలానివా
అమ్మవా అరుణాచలానివా నువు అమ్మవా అరుణాచలానివా

భువిలోని ప్రత్యక్ష దైవమా అహమును బాపే గిరిరాజమా
స్మరణముననే ముక్తినిచ్చు క్షేత్రమా సకల సృష్టికే మూలాధారమా
జ్ఞానశక్తి రాశిపడిన దుర్గమా బ్రహ్మాండములన్నీ నడుపు బ్రహ్మమా ॥అమ్మ॥

సద్గురువులు సంచరించు భువనమా శాంతితోన శోభిల్లెడి శిఖరమా
ఇలలోని ఈశుని స్వరూపమా పుణ్యక్షేత్రాలకే శక్తినిచ్చు క్షేత్రమా
అద్వితీయమైన నీ సన్నిధి అమరత్వము ప్రసాదించు పెన్నిధి ॥అమ్మ॥

మా ప్రాపంచిక భ్రమలన్నీ త్రుంచుమా ఆధ్యాత్మిక సాధనను ఒసగుమా
నిత్యాగ్నిలాంటి ఈఅహమికను ఆర్పుమా నిత్యమైన ఆత్మలోమముజేర్చుమా
నీవేగా మా సకల సంపద ఉండిపోమ్మా మామదిలో నిండుగా ॥అమ్మ॥

# పాట – 9

రారండీ! రారండీ వినరండీ తీయని పిలుపూ
ఎందుకు ఏమిటి ఆ భారపు బ్రతుకు ॥రారండీ॥

రమణుడనే ఓడవచ్చి లంగరేసి చూస్తుంటే
నావికుడు మన నాన్నే రారండని పిలుస్తుంటే
భౌతిక ఈ మాయలోన భయమొందుతూ బ్రతుకుటేల
ఆనందపు డోలికలలో తేలుటకాలోచనేలా ॥రారండీ॥

అగమ్యమీ జీవనము అంతులేని నరకము
ఆకస్మిక ముగింపుతో ఆగిపోవు పయనము
జన్మలు ఎన్నొచ్చినా దేహాలెన్ని మారినా
నిజమేమో తెలియరాదు నిను నిశ్చింతగ ఉండనీదు ॥రారండీ॥

నాన్నమాట వినలేదా నమ్మకమేర్పడలేదా
మాయా మనస్సు నిన్ను మరల నీయడం లేదా
బంధములను త్రెంచుకొనే బలమిమ్మని అడగరాదా
భారములను ఓడలేసి భద్రముగా ఉండరాదా? ॥రారండీ॥

మాయా సర్వద్రష్టలారా దరినుండి చూడగనేలా?
మరల మరల రాని మహదవకాశమిది
శాంతి సాగర జలాలలో ఓలలాడుచు పయనించి
సచ్చిదానందమైన పరమాత్మను జేర్చే యాత్రిది ॥రారండీ॥

## పాట - 10

మాయాపాశాలు ఈ ఇంద్రియాలూ
మైమరచి ఉండకు క్షణమైనా నీవు ఒక్క క్షణమైనా నీవు ॥మాయా॥

పంచేంద్రియ ఖలులు నిన్ను పరికిస్తూ ఉంటాయి
నిరంతరం ఏదో ఒక మాయజేయ చూస్తాయి
నువు నిత్యమైన జాగృతితో నిలబడు
ఆ పంచేంద్రియ ఖలులతో తలపడు ॥మాయా॥

అగ్నికీలలలాంటివి ఈ భోగాలు
వేలదేహాలను దహియించిన నరకాలు
ముందు తేనెలాగ ఉన్నదేదయినా
మారుతుంది చివరికది విషములా ॥మాయా॥

తీర్చిన ప్రతి కోరిక మనసున ముద్రవుతుంది
మరల మరల ముద్రపడితే వాసనగా మారుతుంది
వాసనలే పునర్జన్మ హేతువులు
జనన మరణ చక్రానికి పాశములు ॥మాయా॥

మనసు కూడగట్టిన పాపమే ఈ దేహము
దేవుడూదిన బుడగయే మన ప్రాణము
మనము పెంచి పోషించిన దీ చిత్తము
జన్మజన్మల అలవాటే ఈ దేహభావము ॥మాయా॥

## పాట - 11

భక్తుల పాలిట శివా ధీనుల రక్షక ప్రభో
మము బ్రోచుటకే జన్మకు వచ్చిన భగవద్రూపా శ్రీనాన్నా

రాజయమ్మ సూర్యనారాయణుల
పరమ పుణ్య అద్భుత ఫలమా
రమణ మహాత్ముని ముద్దుల తనయా
రమణీయ చరితా ఓ తండ్రీ! ॥భక్తుల॥

నీ బాల్యమే భక్తి సముద్రము
కౌమార్యమే ధ్యాన యోగము
యవ్వనములోన యోగీశ్వరుడవు
నీ వార్ధక్యమే జ్ఞాన తేజమయా! ॥భక్తుల॥

కరుణయే నీ రూపము
దివ్యతేజమే నీ దేహము
శాంతిని కురిసే చల్లని హృదయా
భవరోగహరా గురువర్యా! ॥భక్తుల॥

అజ్ఞాన తిమిరము బాపి
అమరశాంతి పంచుటకే
మానవ రూపుతో మహిలో కొచ్చిన
సమతను చాటే మహనీయా! ॥భక్తుల॥

## పాట - 12

ఆయువూ తరిగిపోతుంది దేహమూ తడబడుతోంది
ఏదీ ఓ మనసా ఒక్క అవగుణమైనా వదిలితివా
ఆత్మ ఛాయలకైనా చేరితివా! ॥ఆయువూ॥

మరణముతో ఎగిరిపోవు నడమంత్రపు ఈ సిరులు
మరుభూమితో వీడ్కోలు చెప్పెదరీ బంధువులు
నాదీ నాదని చాటే నీ దేహమె నీవెంటరాదు

ఇక ఏది నీకు శాశ్వతము ఈ మిథ్యా లోకములో ॥ఆయువూ॥

హృదయములో వెలుగుచున్న వజ్రాల దీవిని వదలి
ఈ లోకంలో మెరిసేటి గాజు పెంకులేరుకుంటే
లభియించిన మానవజన్మం కాదా అది నిరర్థకం
తాత్కాలిక ఈ భాగ్యం తెలియనీదు పరమార్థం ॥ఆయువూ॥

దానములొనరించినా క్షేత్ర దర్శనం చేసినా
తత్త్వవిద్యవల్లెవేసినా తపము జపము లాచరించినా
అహమును విడనాడకుంటె ఆత్మ నీకు అందబోదు
కర్తృత్వ సాధనలకు కలగదుగదా మోక్షమ్ము ॥ఆయువూ॥

## పాట - 13

ఏమిటి నీ మార్గం ఎక్కడికీ పయనం
దేనిని సాధించుటకీ నీ జీవితం
మరి దేనిని సాధించుట కీ నీ జీవితం ॥ఏమిటి॥

సిరిమించిన పరమార్థం సృష్టిలోనే లేదనీ
అజరామర దేహమని శాశ్వతమీ భోగమనీ
నాదీ నా వాళ్ళనే ఈ బంధమే నిత్యమనీ
బ్రతుకు వ్యర్థం చేసుకొని భ్రమలలోన మునిగిపోకు ॥ఏమిటి॥

నీ వెంట వచ్చునది ఏది? వెంటరానిదేది?
ఇహపరముల లోన నిన్ను రక్షించెడి నాథుడేడి?

యుక్తాయుక్త విచక్షణ ఇక్కడనే చేసుకో
ఆపైనా జీవితాన్ని సురక్షితంగా మలుచుకో ॥ఏమిటి॥

ఈ మానవ జీవితము మరణముతో ముగిసిపోదు
శవదహనముతో సర్వము ముగియునని నమ్మబోకు
మరణానంతర జీవితమొకటుందని నువు మరచిపోకు
తిరిగి సృష్టిలోకి రాకుండా సద్గురుని శరణొందు నేడు ॥ఏమిటి॥

మరణకాలమొచ్చుసరికి మనసన్నదే ఉండరాదు
ఆపరమాత్ముని ధ్యాస తప్పా అన్యమేదీ మిగలరాదు
సద్గురువును స్మరియించుటే సర్వదా రక్ష నీకు
మరణానంతర పయనములో ఆ గురువొక్కడే తోడు నీకు ॥ఏమిటి॥

## పాట – 14

రమణుని ప్రతిరూపం శ్రీనాన్నగారు
ప్రేమకు ప్రత్యక్షవతారం మన నాన్నగారు ॥రమణుని॥

శుద్ధమైన నాన్న హృదయమూ స్ఫటికలాగా మారగా
అదను చూసి రమణుడు హత్తుకొనే నేరుగా
మన అందరి అదృష్టం పండగా శ్రీనాన్నే దొరికెనూ గురువుగా ॥రమణుని॥

మన పూర్వజన్మ పుణ్యమూ పుట్లకొలది పండెను
పులకించిన దైవమే శ్రీనాన్నగ ఇల నిలిచెను
కాలం ఎంతో కరుణించెనూ నేడూ అహమంతా ఆవిరౌను ఈనాడు ॥రమణుని॥

గత జన్మములందున శివోపాసన చేసెను
ఈ జన్మమందున శివునిగ తను మారెను
శ్రీ నాన్న తోడు మనకుండగా చిత్తమున ఇక చింత దండగ ॥రమణుని॥

వ్యర్థమైన తలపులతో కాలాన్ని చంపకు
భ్రమల ఈ చిత్తము నమ్మి బ్రహ్మమునే వదలకు
శ్రీ నాన్ననే మనసున నింపుకో నీ జన్మమే ధన్యం చేసుకో ॥రమణుని॥

## పాట – 15

ఏమి మాయ చేస్తున్నావే మాయదారి ఓ మనసా
హృదయములో బ్రహ్మమునొదలి భ్రమలో జీవిస్తావే
హృదివాసం నిను మట్టుపెట్టునని శిరస్సులో పాగా వేస్తావే ॥ఏమి॥

మనోదేహాలనే నువ్వు నీవనుకొంటుంటావే
కాలం విలువ తెలిసి కూడా గాలిపనులు చేస్తావే
నీ గాలిబుడగ జీవితాన్ని అనుక్షణం మరచెదవే
సృష్టికర్త నీవయినట్లే సోకులు పోతుంటావే ॥ఏమి॥

జపాలూ ధ్యానాలంటూ ఆత్మాన్వేషణలంటూ
హృదయంలో ఒదిగిన నన్ను శిరసులోకి నెట్టేస్తావే
ఆత్మలోనే నిత్యము ఉంటూ ఆత్మ కోసమన్వేషణేమిటి?
ఆత్మనే నేనయి ఉండీ మనో దేహభావనేమిటి? ॥ఏమి॥

బాహ్య సాధనలింక పూర్ణముగా వదిలేసెయ్

తరం తరం నిరంతరం హృదయములో మునిగేసెయ్
హృదయ బ్రహ్మములో నువ్వు బ్రహ్మముగా స్థిరపడిపో
సర్వములో నిండివున్న సర్వసాక్షి నీవయిపో ॥ఏమి॥

నీవు నేనూ బ్రహ్మము సకల జీవులూ బ్రహ్మము
రాయీ రప్పా బ్రహ్మము ఈ విశ్వమంతా బ్రహ్మము
ఉన్నది బ్రహ్మం ఒక్కటే ఉన్నది ఆ బ్రహ్మం ఒక్కటే
సర్వమూ బ్రహ్మమయం సకలమూ బ్రహ్మమయం

## పాట - 16

భోగాల పరంపరలో మునిగిపోకూ యోగాచరణను మరచిపోకూ
నిత్య జాగృతితో నిరంతర సాధనతో నీ స్వస్థితిలో నిలచివుండూ
నీ స్వస్థితిలో నిలచి వుండు ॥భోగాల॥

లోకంలో సుఖముందీ పద అంటుందీ మనసు
మనసునూ అనుసరించి నువ్వు పతనమయిపోకూ
నీ కళ్ళెదుటే కోట్లమంది కడదేరిపోతుంటే
నీ బుద్ధీ వివేకాలు గుర్రుపెడుతున్నాయా? గ్రుడ్డివైపోయాయా? ॥భోగాల॥

కాలం కరిగిపోతుందీ దేహముడిగిపోతుంది
నీ మనసేమో మరీ మరీ బలపడిపోతుంటుంది
నరకానికి మెట్లుకట్టి నిన్ను లాక్కుపోతుంది
ఆ అగ్ని ఆరని చోట పురుగు చావని చోట నరకయాతనలే

నీకు నిత్యమైపోతాయి ॥భోగాల॥

నువ్వెంత అనుభవించి చూడు ఇక చాలుననే తృప్తిరాదు
తీరిన ప్రతి కోరికా మరింతగా బలపడుతుంది
మరోపది కోరికలకు అదే పురుడుపోస్తుంది
తైలాన్ని పోసి మనం అగ్నికీలలార్పలేము -
తృప్తి పరచి కోరికలను ఎన్నటికీ జయించలేము ॥భోగాల॥

మనసు నేను కాదనే స్పృహలో నువు నిలిచివుండు
ఈ లోకము అబద్ధమనే సత్యాన్ని ఎరిగివుండు
ఎరుక కల్గి నిరంతరం ఆత్మ నిష్ట నభ్యసిస్తే
నీ మనసు కరిగిపోతుంది బ్రహ్మమే నీవుగా మిగులుతోంది ॥భోగాల॥

## పాట - 17

అజ్ఞానము త్రుంచి వేయు కార్యమై అవతరించాడీ రమణేశుడు
జ్ఞాన సంపదలనే జనుల కివ్వదలచి భక్తజనుల భాగ్యమై భువిని వెలసినాడు
జయహో జయహో జయహొ జయహొ జయహో
జయహో జయహో జయహొ జయహొ జయహో ॥అజ్ఞానము॥

అలగమ్మ సుందరులు ఏమి నోము నోచినారో
తిరుచ్చుళిలో పురమెంత తపమాచరించినదో
అరుణాచల క్షేత్రమెంత నిరీక్షణ చేసినదో
ఈ రమణ సద్గురునికోసం అవని ఎంతగా ఆరాటపడినదో ॥అజ్ఞానము॥

దివ్యజ్ఞాన సౌందర్యముతో సంపూర్ణమైన తత్వ ప్రజ్ఞతో
మృత్యువే భీతిల్లెడి మహోన్నత తేజముతో
దిగంతముల పాలించెడి దివ్యపురుషుడీ రమణుడు
దివి నుండి దిగి వచ్చిన పరమేశుడే ఈ రమణుడు ॥అజ్ఞానము॥

ఆత్మశక్తి కర్థముగా కరుణకు దేహరూపముగా
మూర్తీభవించిన వైరాగ్యపు ముద్దగా
ముముక్షువుల పాలిట అపరముక్కంటిలా
అఖిలమంతా నిలిచాడీ అరుణాచల రమణుడు ॥అజ్ఞానము॥

తలచుకొన్న వారికి తపన దీర్చు రమణుడు
స్మరణముతో అహము బాపి శాంతినిచ్చు రమణుడు
చేరుకొన్న వారికి మోక్షమిచ్చు రమణుడు
జ్ఞాన ధనుడు ఈ రమణుడు జగద్రక్షకుడీ రమణుడు ॥జయహో॥

## పాట – 18

ఓంకార రూప శ్రీరమణా హరోంహర రమణా గురు రమణా
జయ జయ రమణా ప్రియ రమణా అరుణాచల రమణా ప్రభు రమణా

మేం గుడులు గోపురాలంటుంటే నీవు గుండెలో దైవమని అంటావు
మేం ఆచారాలను వల్లిస్తే నువు అందరినొకటిలాగ చూస్తావు
గజ ఈతగాళ్ళు మేమంటే నువు గజమీదలేరని అంటావు ॥ఓంకార॥

మేం వాడెవడీడెవడంటుంటే నువు నేనెవడ నేనెవడంటావు

దేహ భావములో మేముంటే అది బ్రతికిన శవమని వారిస్తావు
నిలవదు మనసని మేమంటే నువు కదులంటే కదలదనంటావు ॥ఓంకార॥

మేం భ్రాంతిలో కొట్టుకుపోతుంటే నువు శాంతిలో మునుగుతునుంటావు
మేం అది ఇది అంతా నిజమంటే నువు ఆత్మొక్కటే నిజమని చెబుతావు
అందుకే కలియుగ గురువులలో నిను సర్వశ్రేష్ఠుడని అంటాము ॥ఓంకార॥

## పాట – 19

ఎవరో ఎవరో ఈ స్వామి ఎందుల కిచ్చటనున్నారో
దివ్య పురుషునిలా ఉన్నారు స్వామి దిక్కుల వెలుగుచునున్నారు? ॥ఎవరో॥

ఇతడితడే అరుణాచల రమణుడు అవతారమెత్తిన సుబ్రహ్మణ్యుడు
అపుడేమో సురసైన్యాధిపతి ఇపుడేమో అమరశాంతికి అధిపతి

ఎందుకోసమీ అవతారం అసలెందుకు ఇలలోకొచ్చారు
ఏ మార్గములో నడిచారు స్వామి జగతికి ఏమని చాటారు?

మరణము కన్నా ముందుగనే నీ దేహములో నీవుండగనే
మోక్షము పొందే మార్గమును మర్మము లేక తెలిపారు
అందుకే ఇలలో కొచ్చారు అమరునిగా నేడున్నారు

ఎందుకు ఎందుకు ఆ చూపు ఎడతెగకుండా చూస్తారు
గుండెలో గుచ్చుకుపోతుంది నా గుట్టంతా బయటకు వస్తుంది

అహమంటె స్వామికి విరుద్ధము ఆత్మగా ఉండాలంటారు

ఒక్క చూపుతో అహమును కూల్చేసి అమరశాంతిని ప్రతిగా ఇస్తారు

మనుషులు పక్షులు పశువులను మొక్కలు క్రిములు నిర్జీవులనూ
సర్వమూ సమమంటారేమి? సమాధానమే వినరేమి?

ప్రాణము ఉన్నా లేకున్నా అది పరమేశ్వరుని సృష్టి కదా
పలు తీరుల దేహాలెన్నున్నా లోనున్నది పరమాత్మ ఒక్కటేగా
అందుకే సమమని అంటారు ఆత్మొక్కటే నిజమని చెబుతారు

దినములు తరబడి చూస్తున్నా నే ప్రతినిముషం కనిపెడుతున్నా
చెరగని ఆ చిరుదరహాసం తిమిరము బాపే ఆ తేజం
ఏమిటి ఏమిటి గురు దేవా ఎటులిది సాధ్యం చెప్పండి

స్వామి మధురైలోనా ఒకనాడు మృత్యువుతో తలపడ్డారు
దేహచలనమే ఆగింది అంతనే ఆత్మ స్ఫురణమే కలిగింది
నేనంటేను ఆత్మయని అమర సత్యం కనుగొని లేచారు
ఆత్మలో ఆత్మగా నిలిచారు స్వామి శాంతికి ద్వారం తెరిచారు

## పాట - 20

నువ్వు కాని దాన్ని విడిచిపెట్టు సాధకుడా నువ్వయినదాన్ని పొందేస్తావ్ సాధకుడా
గురుబోధను అనుసరిస్తే సాధకుడా గుర్తు ఎరుక పడుతుంది సాధకుడా

ఈ మనో దేహాలే నీవని నీవొక భోగాల బాటసారివని
భ్రాంతి ఒకటి నిను నిత్యం నిలువెల్లా అల్లుకుంటుంది

జన్మమంటె భోగమనీ ఈ భోగమే జీవిత లక్ష్యమని
నీ కళ్ళు మూసి నీ మనసు నిను మాయలో ముంచేస్తుంటుంది ॥నువ్వు॥

గురు బోధకన్నా భిన్నమైనది అది విషమని నువ్వు భావించు
ఎన్నటికీ ఈ భావాలతో విభేదాన్నే కొనసాగించు
నీ శిరస్సులో లేచే తలపులే నీ మనసని నీవు తెలుసుకో
అసత్యమైన మనసును నేను కాదని నిలుచుటే సత్య సాధన ॥నువ్వు॥

సృష్టి ఆరంభమయినప్పుడే నువు బ్రహ్మ స్వరూపునిగున్నావు
పిదప లోక మాయకు వశమై ఈ దేహభావములో మునిగావు
నీ స్వస్థితి తిరిగి పొందుటకే మనుజునిగా మహిలో కొచ్చావు
చైతన్య స్వరూపుడవే నీవు ఆశుద్ధ పరమాత్మవే నీవు ॥నువ్వు॥